క్లుప్తంగా

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పెదవేగి గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదవేగి : చిత్రలేఖనంతో విద్యార్థుల్లో నేర్చుకోవాలనే తపన పెరుగుతుందని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు.

నేడు భీమడోలులో వైఎస్సార్ సీపీ నేతల సమావేశం

భీమడోలు: భీమడోలు జంక్షన్‌లోని వీసీ కన్వర్షన్ హాల్‌లో ఈనెల 23వ తేదీ సోమవారం మండల వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు భీమడోలు మండల పార్టీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు సోమ వారం రాత్రి తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నేతలు, నాయకులు విధిగా హాజరు కావాలని వారు కోరారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ విజయానికి వైఎస్సార్ సీపీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు వాసుబాబు దిశానిర్దేశం చేస్తారని వారు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

పెదవేగి : మూడు గ్రామాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం భోగాపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 3,750 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అమ్మపాలెంలో పేకాడ ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,030, పెదకడిమిలో ముగ్గురు జూదరులను అరెస్టు చేసిన వారి నుంచి రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

పార్వతీ రామచంద్రన్‌కు సన్మానం



సన్మానిస్తున్న గరికపాటి ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ అధ్యక్షురాలు, నాట్య మయూరి ఎ. పార్వతీ రామచంద్రన్ కూచిపూడి నాట్య రంగంలో చేసిన విశేష సేవలకు గానూ ఆమెను గరికపాటి ఆర్ట్స్ సంస్థ ఘనంగా సన్మానించింది. స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం పార్వతీ రామచంద్రన్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శన అనంతరం పార్వతీ రామచంద్రన్‌ను గరికపాటి ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు గరికపాటి కాళిదాసు, ఎంవీఆర్ఎస్ శర్మ దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

25 నుంచి నిరసనలు

ఏలూరు (టూటౌన్): ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన జిల్లాలోని సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరువు నుంచి పేదలు, వ్యవసాయ కూలీలు, రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వాలు నిర్దిష్ట ప్రణాళికను రూపొందించాలన్నారు. తక్షణం ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని కోరారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం

ఏలూరు (టూటౌన్): ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను గత తొమ్మిదేళ్ళ మోదీ పాలనలో నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మిక చట్టాలను కేంద్రం కాలరాస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనింగ్ సమావేశం స్థానిక స్ఫూర్తి భవనంలో యూనియన్ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31న ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై కేంద్ర కార్మిక, రైతు సంఘాలు నవంబర్ 26, 27, 28 తేదీల్లో రాష్ట్ర కేంద్రాల్లో గవర్నర్ కార్యాలయాల వద్ద నిర్వహించ తలపెట్టిన ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బండి వెంకటేశ్వరరావు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ఉత్సాహంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



భీమడోలు: పూళ్లలోని భవానమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



పెదపాడు: వట్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో దుర్గాదేవి అలంకరణలో అంబికాదేవి



దెందులూరు: గోపన్నపాలెంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



భీమడోలు: గుండుగొలనులో దుర్గాదేవి



భీమడోలు: పూళ్ల బావిలో దుర్గాదేవిగా అమ్మవారు



పెదవేగి: మహిషాసురమర్దనిగా రాట్నాలమ్మ

భీమడోలు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలువేల్పు భవానమ్మ ఆలయంలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారిని ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును ఆలయ మర్యాదలతో ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు పుప్పాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి వెంకన్న, పుప్పాల గోవర్ధన రామానుజం, పచ్చా బాబి, సమయం చిన్నబాబు, పెద్దిరెడ్డి బోగయ్య, జిల్లా సాగు సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా అంబికా దేవి

పెదపాడు: మండలంలోని వట్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని అంబికా దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పసుపు కుంకుమలతో అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గోపన్నపాలెంలో..

దెందులూరు: గోపన్నపాలెం అమ్మవారి ఆలయంలో ఆదివారం దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఎల్ఐసీ రాంబాబు ఏకపాత్రాభియనం ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారుల కోలాటం నృత్య ప్రదర్శనతో అలరించారు. సీతంపేట, కొవ్వలి, జోగన్నపాలెం, పోతునూరు, దెందులూరు, గంగన్నగూడెం గ్రామాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం

భీమడోలు: మండలంలోని భీమడోలు, గుండుగొలను, కురెళ్లగూడెం, పూళ్ల, ఎంఎంపురం, నరేడ్లగూడెంలోని ఆలయాల్లో అమ్మవార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారు దుర్గాష్టమి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గుండుగొలను ఆలయంలో భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు ఉదయం వారాహిదేవిగా, సాయంత్రం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కురెళ్లగూడెంలోని గోదావరి కాల్వ గట్టుపై వేంచేసియున్న అమ్మవారు మహిషాసురమర్దనీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూళ్లలోని బావివీధిలోని అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు

పెదవేగి : దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మవారు ఆదివారం మహిషాసుర మర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం కావడంతో విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.29,640, లడ్డూ ప్రసాదాల విక్రయాలతో రూ.18,720, ఫొటో విక్రయాల ద్వారా రూ.2,065 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.9,515 విరాళాలు అందించారని ఈవో తెలిపారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్ కుమార్ తెలిపారు.

కిడ్నీ బాధితురాలి చికిత్సకు రూ.8 లక్షల సీఎం సహాయ నిధి



దుర్గమౌనిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి (ఫైల్)



శస్త్రచికిత్స నిమిత్తం రూ.8 లక్షల ఎల్ఓసీని అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత కొఠారు రామచంద్రరావు తదితరులు

పెదవేగి : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ వైఎస్సార్ సీపీ ఆదుకుని అండగా ఉంటుందని జిల్లా అధికార ప్రతినిధి, ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పెదవేగి మండలం ముండూరుకి చెందిన గౌడ్ దొంత నాగరాజు కుమార్తె దొంత దుర్గమౌనిక (21) చికిత్సకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అండగా నిలిచారని కొఠారు చెప్పారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లాలో వరద ముంపు ప్రాంతాల పర్యటనకు వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, దుర్గమౌనిక విషయం తెలియజేయగా, అప్పటికప్పుడే సీఎం రూ.లక్ష తక్షణ సాయం అందజేశారని తెలిపారు. శస్త్ర చికిత్స కోసం సాయం అందించాలని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కోరగా, సీఎం జగన్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ నేపథ్యంలో దుర్గమౌనికకు సంబంధించిన రిపోర్టులు సీఎంఓ అధికారులకు సమర్పించి, పలుమార్లు వారితో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడటంతో బాధితురాలి శస్త్ర చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.7 లక్షలు ఎల్ఓసీ మంజూరైందని తెలిపారు. సంబంధిత ఎల్ఓసీ పత్రాన్ని కొఠారు రామచంద్రరావు కొండలరావుపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం దుర్గ మౌనిక కుటుంబ సభ్యులకు అందజేశారు. రూ.8 లక్షల సాయం అందించిన సీఎం జగనన్నకు, అండగా నిలిచిన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి దుర్గ మౌనిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీ కోటగిరి పాదయాత్ర విజయవంతం



ద్వారకాతిరుమలలో ఎంపీ కోటగిరి శ్రీధర్‌తో ఎమ్మెల్యే వాసుబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, పోలసానిపల్లి సర్పంచ్

భీమడోలు/ఉంగుటూరు : ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కామవరపుకోట నుంచి ద్వారకాతిరుమల వరకు ఆదివారం చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో భీమడోలు మండలం నుంచి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారకాతిరుమలలో ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ కోటగిరితో కలిసి ఎమ్మెల్యే వాసుబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా ఆయన కుడి చేతికి ముస్లిం ఇమామీ జమీన్ కట్టి అప్యాయతను చాటారు. మండల పార్టీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, పాము మాన్‌సింగ్ ఎంపీపీ కే రామయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎం.జాన్సన్, ఎంపీటీసీలు ఇంజేటి జూనియర్, గంటా శ్రీనివాసరావు, ఆల్తి గోపి పాల్గొన్నారు. ఉంగుటూరులో జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, చేబ్రోలు సొసైటీ అధ్యక్షుడు పాపారావుబాబ్జి, ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, ఎంపీకి ఘన స్వాగతం పలికారు.

దెందులూరు/పెదపాడు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు తదితరులు పాల్గొన్నారు. ఎంపీ కోటగిరి పాదయాత్రలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ పాల్గొన్నారు. 50 కేజీల కేక్‌ను కామవరపుకోటలో ఎంపీ శ్రీధర్, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీతో కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వీరమ్మకుంట ఎంపీటీసీ పూడి అప్పల స్వామి, కోట గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేసిన దాతలు

దెందులూరు: చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు వడ్లపట్ల కస్తూరిమాత మెమోరియల్ ట్రస్టు చైర్మన్ వడ్లపట్ల సత్యనారాయణ, వడ్లపట్ల ప్రసాద్, వడ్లపట్ల రామచందర్ అన్నారు. కొవ్వలిలో సేవా కార్యకర్త సీనియర్ ఉపాధ్యాయులు వడ్లపట్ల విజయ్‌కుమార్‌తో కలిసి 2023లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 30,000 అందించారు. కొవ్వలి గ్రామానికి చెందిన గొరిపర్తి శ్రీదేవికి రూ.8 వేలు, కాపుదాసు ప్రదీప్, బీ.మాధవిచరిష్మా, పిల్లి కిరణ్మయి, ముసునూరు సాయివెంకటేష్, పుట్ట ఈశ్వర్‌కు కొవ్వలి పాఠశాల హెచ్ఎం ఎస్ఎల్‌ఎన్‌వీజీ శర్మ, రాచూరి జెడ్పీస్కూల్ హెచ్ఎం వడ్లపట్ల విజయకుమార్‌తో కలిసి స్కాలర్‌షిప్‌లు అందజేశారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సంఘటితం కావాలి

ఏలూరు(మెట్రో): అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ సంఘటితమై జిల్లా స్థాయిలో బలోపేతం కావాలని ఏపీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.సుమన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవన్‌లో జిల్లా స్థాయి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఐకమత్యంతో ముందుకు సాగి ప్రభుత్వాన్ని మెప్పించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తక్కువ వేతనానికి ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అభద్రతాభావంతో పనిచేస్తున్నారని ఆయన అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేకమైన సర్వీస్ రూల్స్‌ను తయారుచేసి అమలు చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఏపీ జేఏసీ అమరావతి ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.రమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షురాలు జ్యోతి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు గురునాథ్, సుశీల, లక్ష్మీకుమారి, హైమావతి, రంగ భాస్కర్, కిషోర్, సుబ్బారావు, అనిల్ ఆదిరెడ్డి దుర్గ, నాగేశ్వరమ్మ, రాజేష్, నాగేశ్వరరావు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చురుగ్గా సబ్ స్టేషన్ పనులు



గుడివాకలంకలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్



తీగలు బిగిస్తున్న సిబ్బంది

- కొద్దిరోజుల్లో ప్రారంభం
- రూ.4.50 కోట్లు ఖర్చు
- విద్యుత్ సమస్యలకు చెక్

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామం గుడివాకలంకలో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రి యంత్రాలు బిగిస్తున్నారు. చాటపర్రు నుంచి గుడివాకలంక, పెదయాగనమిల్లి, తదితర గ్రామాలకు ప్రత్యేక లైన్లు వేస్తున్నారు. పనుల కోసం ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ట్రాన్స్‌కో ఏడీ కె.గోపాలకృష్ణ పరివేక్షణలో సిబ్బంది పనులు చకచకా చేస్తున్నారు. కొద్ది వారాల్లో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ కోతలకు ఫుల్‌స్టాప్

సబ్‌స్టేషన్ నుంచి కరెంట్ సరఫరా ప్రారంభమైతే కొల్లేరు ప్రజలను ఏళ్ల తరబడి వేధిస్తున్న విద్యుత్ కోతలకు ఫుల్‌స్టాప్ పడుతుంది. ఇప్పటి వరకు చాటపర్రు సబ్‌స్టేషన్ ద్వారా తిమ్మారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, పెదయాగనమిల్లి, కోమటిలంక గ్రామాలకు అధికారులు కరెంట్ సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామాల్లో వేలాది గృహాలతో పాటు చుట్టుపక్కల వందల ఎకరాల్లో చేపల చెరువులకు సైతం ఇదే సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. ఫలితంగా వేసవి కాలంలో కరెంట్ కోతలు ఏర్పడుతున్నాయి. ఒకే ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేయడం వల్ల ప్రజలు లోఓల్టేజీ సమస్య ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు గుడివాకలంకలో సబ్‌స్టేషన్ నిర్మాణంతో సమస్యలకు చెక్ పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్యే కృషి ఎంతో ఉంది



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కృషితో ప్రభుత్వం సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసింది. ఇందుకోసం నిధులు విడుదలయ్యాయి. ఇప్పటికే ప్రజల కోరిక మేరకు అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్తలైన్లు ఏర్పాటు చేశారు. సబ్‌స్టేషన్ పూర్తి అయితే గృహ అవసరాలు, చేపల చెరువులకు వేర్వేరుగా కరెంట్ ఇవ్వడం వల్ల ఇక నుంచి ఎలాంటి సమస్యలు ఉండవు.

– ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

మా చిరకాల కోరిక



గుడివాకలంకలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నది మా చిరకాల కోరిక. ప్రజలు ఎన్నో ఏళ్లగా లోఓల్టేజీ సమస్యతో సతమతమౌతున్నారు. ఇప్పటికే అధికారులు కొత్త ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు వల్ల గృహ అవసరాలకు, వ్యవసాయం, చేపల సాగుకు వేర్వేరుగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. సబ్‌స్టేషన్ పూర్తి కాగానే 24 గంటలూ కరెంట్ సరఫరా అవుతుంది. వర్షాకాలం, వరదల సమయంలో ప్రజలు ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా జీవించవచ్చు.

– జయమంగళ రామారావు, మాజీ ఎంపీపీ